## కాలనీల్లో రోడ్ల అభివృద్ధి

మియాపూర్, నవంబర్ 23 :కాలనీల్లో మెరుగైన ప్రయాణం కోసం రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేజ్ 2లోని జీఎస్ఆర్‌నగర్‌లో శనివారం ఆయన పర్యటించారు. కాలనీలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, అనీల్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, నగేశ్‌గౌడ్, ప్రభాకర్, సాధిక్, రవీందర్, నవీన్, శ్రీధర్, ఏఈ రాజీవ్, రవికుమార్ పాల్గొన్నారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

జీడిమెట్ల, నవంబర్ 23 : సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ లూయిస్ బ్రెయిలీ భవనంలో కేకే రెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజెబుల్డ్ ప్రధాన కార్యదర్శి వంగాల నరేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాల డాక్టర్లు పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# సంఘాలు కాలనీల అభివృద్ధికి పాటుపడాలి

**• ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన సురక్ష గ్రీన్ మెడోస్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

దుండిగల్, నవంబర్ 23 : కాలనీల అభివృద్ధికి పాటుపడే సంక్షేమ సంఘాల సభ్యులకు తన వంతు సహకారం ఉంటుందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు తెలిపారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డీ.పోచంపల్లిలోని సురక్ష గ్రీన్ మెడోస్ కల్చరల్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు శనివారం శంభీపూర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజు మాట్లాడుతూ.. అసోసియేషన్ సభ్యులంతా ఐకమత్యంగా ఉంటూ కాలనీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సురక్ష గ్రీన్ మెడోస్ కల్చరల్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు వేణుగౌడ్,జనరల్ సెక్రెటరీ శ్రీరాములు,ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్‌రెడ్డి,సుధాకర్‌గౌడ్,సాంబశివరావు,అమర్నాథ్,భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• అనంతరం వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు,బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ రాజును కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. పరిష్కారానికి కృషి చేయాలని కోరగా ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు.

# విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యం

**• ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**
**• ఎంఎల్ ఆర్ఐటీ కళాశాలలో ఎంయూఎన్ సదస్సు**

సదస్సులో పాల్గొన్న విద్యార్థులతో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్,నవంబర్ 23 : దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలలో రెండుపాటు జరిగే మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఎంయూఎన్) సదస్సు శనివారం ప్రారంభమైంది. వివిధ కళాశాలలు, పాఠశాలల నుంచి సుమారు 150 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే, కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి సదస్సులో పాల్గొని మాట్లాడుతూ.. ఎంయూఎన్ కేవలం చర్చకు వేదిక మాత్రమే కాదని యువత సాధికారత, సహకారం, ప్రపంచ పౌరసత్వం యొక్క వేడుకగా నిలిచిందన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే సదస్సు లక్ష్యమన్నారు. ఈ సదస్సు ఈనెల 24వరకు కొనసాగుతుందని తెలియజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ వీ. రాధికాదేవి ప్రసంగించారు. కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, వివిధ విభాగాల హెచ్ఓడీలు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# కేఫ్ కల్చర్‌లో కొత్త అధ్యాయం 'స్టెల్లార్ రిజర్వ్'

సిటీబ్యూరో, నవంబర్ 23(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లో 'స్టెల్లార్ రిజర్వ్' కేఫ్ వినూత్న రుచులకు కొత్త ప్రయాణం అని నిర్వాహకులు తెలిపారు. నగరంలో కేఫ్ కల్చర్‌లో కొత్త అధ్యాయం సృష్టించేందుకు స్టెల్లార్ రిజర్వ్ కేఫ్ ప్రారంభమైందని తెలిపారు. స్టెల్లార్ రిజర్వ్‌లోని కాఫీ అనుభవానికి మునుపెన్నడూ చూడని ప్రత్యేకత ఇచ్చే పరికరం 'స్ట్రాడా ఎక్స్' అనే అధునాతన యంత్రమని చెప్పారు. ఈ యంత్రం ప్రఖ్యాత లా మార్జోకో బ్రాండ్ ద్వారా రూపొందిచబడిందని వారు పేర్కొన్నారు. ఇది దేశంలోనే ఏకైక యంత్రంగా హైదరాబాద్‌లో అందుబాటులోకి వచ్చిందరు. నైట్రో కాఫీ ట్యాప్‌లు నగరంలో మొదటిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు. అరబికా బీన్స్‌తో తయారు చేసిన కాఫీని తాగొచ్చని వివరించారు. స్వీట్స్ ఇష్టపడే వారికి స్టెల్లార్ రిజర్వ్‌లోని గెలాటో వరల్డ్ ఒక వరం లాంటిదని వివరించారు. ఇందులో మెక్సికన్, పాన్ ఏషియన్, కాంటినెంటల్, ఇటాలియన్ వంటకాలు కూడా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

# సహనం, శాంతితోనే సమాజ వికాసం

**• ఏసీపీ హన్మంతరావు**

జగద్గిరిగుట్ట, నవంబర్ 23 : ఇతరుల సంప్రదాయాలపై సహనంతో వ్యవహరిస్తేనే మెరుగైన సమాజం సాధ్యమవుతుందని బాలానగర్ ఏసీపీ హన్మంతరావు సూచించారు. ప్రార్థన మందిరాల వద్ద జరిగిన అవాంఛనీయ సంఘటనల నేపథ్యంలో శనివారం జగద్గిరిగుట్ట ఎంకేఆర్ ఫంక్షన్‌హాల్‌లో పోలీస్‌స్టేషన్ పరిధిలో అన్ని మతాల పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని నమ్మకూడదన్నారు. భావోద్వేగాలకు లోనుకాకుండా అధికారులతో చర్చించి సమాచారం తెలుసుకోవాలన్నారు. ప్రార్థనా స్థలాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీఐ నర్సింహ, డీఐ అంజయ్య పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి లయన్స్ క్లబ్ చేయూత

విద్యార్థి సాయికృష్ణకు రూ. 20 వేల చెక్కు అందజేస్తున్న లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కే.విజయ్‌కుమార్

మాదాపూర్, నవంబర్ 23: పేద విద్యార్థికి లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ చేయూతనందించింది. బాలుడు కుటుంబ సభ్యులు ఫీజు కట్టలేని పరిస్థితుల్లో ఉండటంతో స్కూల్ వెళ్లలేకపోయాడు. ఈ విషయాన్ని స్థానికంగా ఉన్న కొందరు లయన్స్ క్లబ్ దృష్టికి తీసుకురావడంతో లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ బృందం బాలుడు సాయి కృష్ణకు రూ. 20 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బసిరెడ్డి మధుసుదన్‌రెడ్డి, ట్రెజరర్ ప్రవీణ్‌రెడ్డి, మల్లేశ్ యాదవ్, భాస్కర్, రవీందర్, విష్ణు, భగవాన్, శ్రీను తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

వెంకటేశ్వరనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవీరంగారావు

మియాపూర్, నవంబర్ 23: ప్రజల సౌకర్యం కోసం లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవీరంగారావు సంబంధిత అధికారులకు సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్, రోడ్ నంబర్-14లో జరుగుతున్న డ్రైనేజీ పనులు, ఆర్‌పీ కాలనీ కమ్యూనిటీ హాల్ పనులను కార్పొరేటర్ శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు శ్రావణి, ప్రియాంక, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, లింగయ్య, సోమయ్య, నర్సింహులు, రమేశ్, సోమేశ్, వెంకటేశ్వర్‌రావు, శ్యామ్, రామచందర్, నరేశ్, మహేశ్, రవి, రాజు, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

కేపీహెచ్‌బీ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శిలిషాబాబురావు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 23 : కేపీహెచ్‌బీ కాలనీలో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీషాబాబురావు తెలిపారు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీ 2,5వ రోడ్డుల్లో చేపట్టిన డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాలనీలో ఏండ్ల క్రితం వేసిన డ్రైనేజీ ఫైప్‌లైన్లు దెబ్బతినడం వల్ల తరచుగా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. డ్రైనేజీ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. దెబ్బతిన్న డ్రైనేజీ లైన్‌లను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ.. త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాతూరి గోపి, నాగేశ్వర్‌రావు, జాన్‌మోజెస్, నాగేశ్వర్‌రావు, కృష్ణా, స్వప్న, మమత పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 23 : అపస్మారక స్థితిలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని వైద్యశాలలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 11న కేపీహెచ్‌బీ కాలనీలోని 3వ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే చేరుకున్న పోలీసులు ఫిట్స్‌తో బాధపడుతున్న అతడిని చికిత్స కోసం గాంధీ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు జరు పుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడు బిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు తెలిసిం దని పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాలానగర్, నవంబర్ 23 : విద్యుత్ మరమ్మతు పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బోయిన్‌పల్లి సెంట్రల్ బ్రేక్‌డౌన్ (సీబీడీ) ఏడీఈ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి 1.00 వరకు రాజ్‌పుడ్స్ ఫీడర్ పరిధిలోని ఆర్ఆర్‌నగర్, రాజ్‌పుడ్స్, టెక్నో ఎలక్ట్రికల్స్, బజాజ్ ఎలక్ట్రికల్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అరుణాచలం ఫీడర్ పరిధిలోని అరుణాచలం, ఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్, జీహెచ్ సోలార్ సిస్టెమ్స్, టాటా ఇటాచీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుంది. వినియోగదారులు గమనించి సహకరించగలరని ఆయన సూచించారు.

## పేదల ఆకలి తీర్చడం అభినందనీయం

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 23 : పేదల ఆకలిని తీర్చేందుకు అన్నసమారాధన చేయడం అభినందనీయమని కూకట్‌పల్లి జనసేన ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ అన్నారు. శనివారం కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో స్వర్ణపూరి మహేశ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రేమ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా గత నాలుగేండ్లుగా ప్రతి శనివారం అన్నసమారాధన చేస్తున్న స్వర్ణపూరి మహేశ్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కరోనా సమాయాన డొక్కా సీతమ్మ పేరున ప్రారంభించిన అన్నసమారాధన నేటికీ కొనసాగించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సాటివారికి చేతనైనంత సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నేతలు కొల్లా శంకర్, ప్రసాద్, వీరా, అంజి, శిరీష, రమేశ్, శంకర్ రావు, చాంద్‌బాషా, రామకృష్ణ, సాయిరాం చౌదరి, బాలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

శేరిలింగంపల్లి, నవంబర్ 23: బాత్‌రూమ్‌లో ఉరివేసుకొని మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ హబీబ్ ఉల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లి మాధవీనగర్‌కు చెందిన మామిళ్ల భాగ్యలక్ష్మి(26) గచ్చిబౌలి డీఎల్ఎఫ్ ఐటీసెజ్‌లో కాగ్నిజెంట్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పని చేస్తున్నది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కార్యాలయానికి వచ్చిన భాగ్యలక్ష్మి రాత్రి 11 గంటల సమయంలో బాత్‌రూమ్‌కి వెళ్లింది. ఎంతకీ తిరిగిరాకపోవడంతో అనుమానం వచ్చిన తోటి ఉద్యోగులు 12 గంటలకు బాత్‌రూమ్ వద్దకు వెళ్లి పరిశీలించగా బెల్టుతో పైపునకు ఉరివేసుకొని ఉండటాన్ని గమనించారు. బయటకు తీసుకువచ్చిన ఉద్యోగులు భాగ్యలక్ష్మి పల్స్ ఉన్నట్లు గుర్తించి హుటాహుటిన సమీపంలోని దవాఖానకు తరలించగా మార్గమధ్యలో మృతిచెందింది. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. భాగ్యలక్ష్మి వ్యక్తిగత కారణాల కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని, కొన్ని రోజులుగా ఆమెకు ఇంట్లోవారు సంబంధాలు చూస్తున్నట్లు సమాచారం.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్,నవంబర్ 23 : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ధర్మేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లి సెయింట్ మార్టిన్ కళాశాల సమీపంలోని కల్వర్టు సమీపంలో సుమారు 40 ఏండ్ల వ్యక్తి చనిపోయి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## ఎంపీఈడీ పరీక్ష తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: ఓయూ పరిధిలోని మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 3 నుంచి నిర్వహించనున్నట్టు చెప్పారు.

# విద్యార్థులు ఉత్తమ ఇంజినీర్లుగా ఎదగాలి

**• జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి**
**• ఉత్సాహంగా ఫస్టేయర్ విద్యార్థుల స్వాగత వేడుకలు**

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించిన వర్సిటీ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ,నవంబర్ 23 : యూనివర్సిటీలోని వసతులను సద్వినియోగం చేసుకుని.. విద్యార్థులు ఉత్తమ ఇంజినీర్లుగా ఎదగాలని జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీలో మొదటి సంవత్సరం విద్యార్థుల స్వాగతం కార్యక్రమానికి రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు పాల్గొని మాట్లాడారు. సమాజంలో పేరుకుపోయిన సమస్యలకు పరిష్కార మార్గాలు చూపేలా ఇంజినీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలు రూపొందించాలన్నారు.

అధ్యాపకుల సేవలు, అధునాతన ప్రయోగశాలలు, లైబ్రరీ, క్రీడా ప్రాంగణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమశిక్షణతో, స్నేహభావంతో మెలగాలని సూచించారు. అనంతరం ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవీ నర్సింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నృత్యంతో అలరించిన విద్యార్థులు

# స్నేహితురాలే నిందితురాలు..

**• మహిళ హత్యకేసును ఛేదించిన దుండిగల్ పోలీసులు**
**• ఆభరణాల కోసం కల్లు తాగించి ఘాతుకానికి పాల్పడిన మహిళ**
**• హంతకురాలిని పట్టించిన ఆర్టీసీ బస్సు జీరో టికెట్**
**• మృతురాలు, హంతకురాలిద్దరిదీ బాన్సువాడ**

వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సతీశ్, చిత్రంలో నిందితురాలు

దుండిగల్, నవంబర్ 23 : స్నేహితురాలి ఒంటిపై ఉన్న ఆభరణాలపై కన్నేసిన ఓ మహిళ వాటిని ఎలాగైనా కాజేయాలని ఊరుగాని ఊరుకు రప్పించి హతమార్చింది. ఆమె ఒంటిపై ఉన్న సుమారు రూ. 2లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లింది. దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 14న వెలుగు చూసిన గుర్తుతెలియని మహిళ మృతదేహం మిస్టరీని పోలీసులు ఛేదించారు. పాత నేరస్థురాలైన నిందితురాలిని అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు.

ఇందుకు సంబంధించి మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి దుండిగల్‌లోని కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా, బాన్సువాడకు చెందిన అంజమ్మ(45),బూసిబోయిన గంగామణి(40) ఇద్దరికి 10 ఏండ్ల పరిచయం, స్నేహం ఉన్నది. ఇద్దరు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే నేర చరిత్ర కల్గిన గంగామణి చూపు అంజమ్మ ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలపై పడింది. ఎలాగైనా వాటిని కాజేయాలని పథకం రచించింది. అందుకు అంజమ్మను మట్టుబెట్టాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా ఈనెల 14న అంజమ్మను ఎల్లారెడ్డికి బంధువుల ఇంటికి వెళ్లి వద్దామంటూ ఇంటి నుండి తీసుకువచ్చింది. బస్టాండ్‌కు వచ్చిన అనంతరం మాట మార్చి సికింద్రాబాద్ బస్సు ఎక్కించింది. అనంతరం గండిమైసమ్మ చౌరస్తాలో ఇద్దరు బస్సు దిగారు.

**పట్టించిన ఆర్టీసీ జీరో టికెట్టు..**

కాగా 14న హత్యకు గురైన అంజమ్మకు సంబంధించి వివరాలు లభించకపోవడంతో పోలీసులు గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి మార్చురీకి తరలించారు. అయితే అంజమ్మ వద్ద ఆర్టీసీ బస్సు జీరో టికెట్ దొరకడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తును మమ్మురం చేశారు. గండి మైసమ్మ చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సు దిగినట్లు గుర్తించిన పోలీసులు జీరో టికెట్టు ఆధారంగా ఆమె ఆధార్‌కార్డును క్రోడీకరించడంతో మృతురాలు అంజమ్మగా తేల్చారు. అయితే ఆమె ఎక్కడ బస్సు ఎక్కింది..? ఇక్కడ ఎందుకు దిగిందనే కోణంలోనూ దర్యాప్తు చేయగా అంజమ్మ నిజామాబాదులో బస్సు ఎక్కినట్లు గుర్తించారు. దీంతో బస్సు ఎక్కే టైంలో సీసీ కెమెరాలు పరిశీలించగా మృతురాలితోపాటు మరో మహిళ బస్సు ఎక్కి గండిమైసమ్మ చౌరస్తాలో దిగినట్లు గుర్తించారు.

**కల్లు తాగించి హత్య..**

మృతురాలు అంజమ్మ మెడలో ఉన్న ఆభరణాలపై ఆశపడిన గంగామణి ఎలాగైనా అవి కాజేయాలని బంధువుల ఇంటికి వెళ్లొద్దామంటూ అంజమ్మను నమ్మించింది. నిజామాబాద్ నుంచి వెంటబెట్టుకుని తీసుకువచ్చిన గంగామణి గండిమైసమ్మ చౌరస్తాలోని బస్టాండ్ వద్ద ఆమెకు కల్లు తాగించింది. మత్తులో ఉండగానే బహదూర్‌పల్లిలోని కాకతీయ లే అవుట్-2లో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి వెంట తెచ్చుకున్న కర్రతో కొట్టి చంపింది. అనంతరం మృతురాలి ఒంటిపై ఉన్న బంగారు,వెండి ఆభరణాలను తీసుకుని ఉడాయించింది. ఈ క్రమంలో నిందితురాలిని శనివారం ఆమె నివాసంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా అంజమ్మను తానే చంపినట్లు అంగీకరించింది. నిందితురాలి నుంచి బంగారు పుస్తెల తాడు, వెండి ఆభరణాలు, హత్యకు వినియోగించిన కర్రను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**నిందితురాలు పాత నేరస్తురాలు..**

అయితే నిందితురాలు గంగామణిపై నిజామాబాద్‌లో పలు చోరీ కేసులు ఉన్నాయని, ఆమెపై సస్పెక్టియస్ షీట్ సైతం ఉందని డీసీపీ కోటిరెడ్డి వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించి నిందితురాలిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, దుండిగల్ సీఐ సతీశ్, డీఐ బీ.సతీశ్, ఎస్సైలు శంకర్, రామ్మోహన్‌రెడ్డి సిబ్బందిని డీసీపీ అభినందించారు

## ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

కుత్బుల్లాపూర్,నవంబర్ 23 : గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల విలేజ్ స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ పుణ్య రెసిడెన్సీలోని ప్లాట్‌నంబర్ 403లో నివాసం ఉంటున్న రాజారపు పార్వతి(39) భర్త ల